వైభవంగా కల్యాణోత్సవాలు



శివపార్వతుల కల్యాణం సందర్భంగా భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు

వల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అటు కొండపైన, ఇటు దిగువన వివిధ పూజలు, జపాలు, హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే గ్రామంలోని వైద్యనాధేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. ముందుగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణవేదికపై కొలువుదీర్చారు. గణపతి పూజ నిర్వహించి పుణ్యాహవచనం చేశారు. అనంతరం వేదపండితులు కల్యాణ ఘట్టం ముగించారు.

ఈ కల్యాణోత్సవానికి పుష్పగిరి పీఠాధిపతి విద్యానృసింహ భారతిస్వాముల వారు హాజరయ్యారు. ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం అందించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు కార్యనిర్వాహకులు ముత్యాల తలంబ్రాలు అందించారు. సాయంత్రం వేళ కొండపై శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గజవాహనంపై వైద్యనాధేశ్వరుడు ఊరేగగా.. చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు.

కౌమార బాలికల సాధికారత లక్ష్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మే 1 (ఆంధ్రజ్యోతి): కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించబడిన కిశోర వికాసంపై గోడపత్రికను కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా వేసవి సెలవుల్లో ఈనెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు వివిధ శిక్షణ కార్యక్రమాలను కౌమార బాలికలకు అందిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా కౌమార బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శిక్షణా కార్యక్రమాలను కౌమార బాలికలు అందరూ వినియోగించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



వృద్ధురాలికి పెన్షన్ పంపిణీ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు, కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. పట్టణంలోని సాతపల్లె గ్రామంలో పర్యటించి గురువారం తెల్లవారుజామునే మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు కూటమి నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను తీసుకుంటూ భర్త మృతి చెందితే ఆ పింఛను భార్యకు ఇచ్చేందుకు కొత్తగా దరఖాస్తులు కూడా తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకొంటే వెంటనే మంజూరు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జి, ప్రముఖ నాయకులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తోటల్లోనే వదిలేసిన అరటి గెలలు



అరటి గెలలను లారీకి లోడు చేస్తున్న కూలీలు

కుప్పకూలిన అరటి ధర

- కిలో 18 నుంచి 4 రూపాయలకు...
- పెట్టిన పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళన
- కోట్లాది రూపాయలు నష్టపోనున్న అరటి రైతులు

అరటి

రైతు కుదేలయ్యాడు. మొన్నటి వరకు ధర బాగా ఉండటంతో పెట్టిన పెట్టుబడితో పాటు కాసింత డబ్బులు సంపాదించుకోవచ్చని ఆశపడ్డ అన్నదాతకు నిరాశే మిగిలింది. మొన్నటివరకు కిలో రూ.18 పలికిన ధర ఒక్కసారిగా రూ.4కు పడిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని, కాయలు కోసేందుకు కూలీలు కూడా చేతి నుంచి పెట్టుకోవాల్సి వస్తుందని చాలామంది రైతులు కాయలను కోయకుండా అలాగే వదిలేశారు. కాయలను నిల్వ చేసుకునే శీతల గిడ్డంగులు ఈ ప్రాంతంలో లేకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.

రాజంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : అరటి ధరలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. గత నెలలో 18 రూపాయలు కిలో ధర ఉండగా ఒక్కసారిగా 4 రూపాయలకు పడిపోయింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అరటికి మార్కెట్‌లో డిమాండ్ భారీగా తగ్గిపోయింది. అంతేగాక కోసిన కాయలను లారీల్లో లోడు చేసి మార్కెట్‌కు ఎగుమతి చేసే సమయంలో ఎండ తీవ్రత కారణంగా మార్కెట్‌కు చేరే రెండు రోజుల్లోనే కాయ మగ్గిపోతోంది. ధర ఒక్కసారిగా పడిపోవడంతో అరటి రైతు ఒక్కసారిగా కుదేలైపోయాడు. ఎకరాకు సుమారు మూడు లక్షల పైబడి నష్టం రానుంది. ఎకరాకు వెయ్యి అరటి చెట్లను నాటుతారు. వెయ్యి చెట్లు బాగా పండితే 4 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఒక్కో చెట్టు గెల 12 నుంచి 20 కిలోల వరకు బరువు ఉంటుంది. ఆ విధంగా ఉన్నప్పుడు ఒక్కో చెట్టు గెల 400 తక్కువ లేకుండా ధర పలుకుతోంది. ఆ విధంగా ఎకరాకు నాలుగు లక్షలు వస్తే అందులో ఖర్చులు రూ.70 వేలు పోను సుమారు 3 లక్షల పైబడి మిగులుతుంది. అయితే ఒక్కసారిగా కిలో నాలుగు రూపాయలకు పడిపోవడంతో ఒక్కో అరటి గెల 60 రూపాయలు కూడా ధర పలకడం లేదు. దీనివల్ల ఎకరాకు 60 వేలు కూడా వచ్చే అవకాశం లేదు. అంటే పెట్టిన పెట్టుబడి 70 వేలు కూడా దక్కే పరిస్థితి లేదు. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో అరటిని విస్తారంగా పండిస్తారు. చెన్నై, బెంగళూరు, నెల్లూరు, గూడూరు చుట్టుపక్కల పట్టణాలకు ప్రతిరోజూ 20 లారీలకు పైబడి రాజంపేట, కోడూరు ప్రాంతాల నుంచి అరటిని ఎగుమతి చేస్తారు. అరటి పంట ఒక్కసారి రేట్లు పడిపోవడంతో ఈ పంటను సాగు చేసిన రైతులకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. 30 వేల ఎకరాల్లో సాగైన అరటి పంట రేటు లేకపోవడంతో దీనిని నమ్ముకున్న రైతులు భారీ నష్టాల పాలవుతున్నారు. పండించిన కాయలను నిల్వ చేసుకునే శీతల గిడ్డంగులు ఈ ప్రాంతంలో లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. కాయలను కోసి ఎగుమతి చేసినా గిట్టుబాటు ధరలు, కనీసం కూలీ ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేకపోవడంతో తోటల్లోనే కాయలను వదిలే పరిస్థితి ఏర్పడింది. రాజంపేట మండలంలోని ఆకేపాడు, హస్తవరం చెర్లోపల్లె, బావికాడపల్లె, పుల్లంపేట మండలంలోని వత్తలూరు, రెడ్డిపల్లె, ఓబులవారిపల్లె మండలంలోని గొబ్బూరువారిపల్లె, పెద్దఓరంపాడు, చిన్నఓరంపాడు, బాలిరెడ్డిగారిపల్లె, వెంకటరామాపురం, ఎగువరెడ్డిపల్లె, టి.కమ్మపల్లె, కోడూరు మండలంలోని ఉప్పరపల్లె, శెట్టిగుంట, ఓబనపల్లె, చిట్వేలి మండలంలోని నాగవరం, నగిరిపాడు, సీఎం రాచపల్లె, మైలపల్లె, ఇలా చుట్టుపక్కల అన్ని గ్రామాల్లో అరటి పంటను విస్తారంగా సాగు చేసి ఉన్నారు. ప్రస్తుతం పంట అంతా కోత దశలో ఉంది. ఆరుగాలం కష్టించి వేల రూపాయలు ఖర్చు చేసి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆకేపాడు చుట్టుపక్కల 20 గ్రామాల్లో రైతులకు అరటి పంటే జీవనాధారం. పులివెందుల తర్వాత ఆకేపాడు ప్రాంతం అరటి పంటకు పెట్టింది పేరు. అటువంటి ప్రాంతంలో ధరలు లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి అరటిని నమ్ముకున్న రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎగుమతి కోసం సిద్ధంగా ఉంచిన అరటి గెలలు

నమ్మినందుకు బంగారం దోచేశాడు...

- కురబలకోటలో 100 గ్రాముల బంగారం చోరీ



నకిలీ నగలు



బాధితురాలు వరలక్ష్మి

కురబలకోట, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఒక యువకుడిపై జాలిపడి నమ్మి ఇంట్లోకి రానిచ్చినందుకు బంగారాన్ని దొంగిలించుకెళ్లిన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన వరలక్ష్మికి భర్త లేదు. కుమారుడు దివ్యాంగుడు. ఆమె చింతకాయల వ్యాపారం చేస్తోంది. కాగా ఆమె తన మంచానికి ఉన్న లాకరులో 100 గ్రాముల బంగారాన్ని, రూ.50 వేల నగదును పెట్టింది. గ్రామానికి చెందిన ఒక యువకుడు ఆమెకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి వస్తూ పోతుండేవాడు. ఈ నేపథ్యంలో ఆమె తన వద్ద ఉన్న ద్విచక్రవాహనాన్ని కూడా అతడికి ఇచ్చింది. దీంతో ఆ యువకుడు ఆమె వద్ద అతి వినయం నటించి ఇంట్లో ఏయే వస్తువులు ఎక్కడ ఉన్నాయో పూర్తిగా తెలుసుకున్నాడు. ఆమె అప్పుడప్పుడూ ఇంటికి తాళాలు వేసుకుని ఇంటి ఆవరణలో పెట్టి బయటకు వెళ్లేది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆ యువకుడు ఆమె ఊరికి వెళ్లిన సమయంలో ఇంట్లోకి వెళ్లి ఆమె మంచానికి ఉన్న లాకరును తీసి అందులో ఉన్న బంగారాన్ని, నగదును దొంగిలించుకెళ్లాడు. అంతేకాకుండా వాటి స్థానంలో నకిలీ నగలను అక్కడ పెట్టాడు. కాగా ఇటీవల ఆమె జాతరకు వెళ్లేందుకు నగలను వేసుకోవడానికి తీసి చూడగా అవి తేలిగ్గా ఉండటంతో చోరీ జరిగిన విషయాన్ని గుర్తించింది విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మంచానికి ఉన్న లాకరు

పీలేరులో గార్మెంట్స్ పరిశ్రమ

- మహిళలకు ఉపాధి అవకాశాలు
- ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, మే 1(ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలోని పీలేరు లేదా కలికిరి మండలంలో త్వరలోనే ఒక గార్మెంట్స్ పరిశ్రమ రాబోతోందని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరులోని సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మహిళల కోసం నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే పేరెన్నిక గల ఓ గార్మెంట్స్ తయారీ సంస్థ పీలేరులోగానీ, కలికిరిలోగానీ తమ యూనిట్‌ను ప్రారంభించాలని ప్రయత్నిస్తోందని, త్వరలోనే ఆ సంస్థ ప్రతినిధులు ఈ ప్రాంతంలో పర్యటించనున్నారని, వారితో తాను స్వయంగా మాట్లాడి ఆ యూనిట్ ఏర్పాటుకు కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. దీంతో పీలేరు నియోజకవర్గంలోని మహిళలకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నామన్నారు. అధికారులు కల్పించిన అవకాశాన్ని మహిళలకు సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ శిక్షణ శిబిరానికి హాజరై టైలరింగ్‌లో నిష్ణాతులు కావాలన్నారు. ప్రస్తుతం బీసీ శాఖ ద్వారా 130 మంది శిక్షణ కల్పిస్తున్నామని, భవిష్యత్తులో మరింత మందికి అవకాశం కల్పిస్తామన్నారు. అక్కడే కొంత మంది లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు అందజేశారు.

పీలేరు ఆసుపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దాలి



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లారి

పీలేరు 100 పడకల ఏరియా ఆసుపత్రిని జిల్లాలోనే ఆదర్శ ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌రెడ్డి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారిగా ఆయన పీలేరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో గురువారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, సామగ్రిని ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే ఇప్పిస్తామన్నారు.

ఆసుపత్రికి జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు, కాంపౌండ్ వాల్, అగ్నిమాపక యంత్రాలు, ఆర్వో వాటర్ ప్లాంటు, ఆపరేషన్ థియేటర్ పరికరాలు, డార్మిటరీ, కిచెన్, లిఫ్ట్, పోలీసు ఔట్‌పోస్టు కావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటన్నింటినీ త్వరలోనే మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో శివశంకర్, ఏపీవో జవహర్, టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర, మల్లెల రెడ్డిబాషా, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

- మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో గురువారం గంగమ్మతల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులు భారీ సంఖ్య లో ముద్దలు పెట్టుకున్నారు. గంగమ్మతల్లిని అంకాళమ్మ దేవస్థానం నుంచి ఊరేగింపుగా గంగమిట్ట వద్దకు తీసుకుని వచ్చారు. భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకపోతులు, పొట్టేళ్లను గంగమ్మకు సమర్పించుకున్నారు. ఇటీవల చేయించిన బంగారు ఆభరణాలతో గంగమ్మను అలంకరించారు. దర్శనం కోసం కమిటీ వారు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు, ఎస్ఐ జి.నవీన్‌బాబులు జాతర ఉత్సవాలను ప్రత్యేకంగా పర్యవేక్షించారు. పలువురు భక్తులకు అన్నదానాలు చేశారు. మజ్జిగ పంపిణీ చేశారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



↑ రైల్వేకోడూరులో గంగమ్మ తల్లి ఊరేగింపు

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం

- మేడే వేడుకలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు



రాయచోటిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం కోసం ఉన్న హక్కులు, చట్టాలను రద్దు చేశాయని వాటిని పునరుద్ధరించే వరకు పోరాటాలు చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు తెలిపారు. గురువారం మేడే సందర్భంగా రాయచోటి పట్టణంలో విద్యుత్, ఐసీడీఎస్, రెవెన్యూ, బస్టాండు, మున్సిపల్ ఆఫీస్, మార్కెట్‌యార్డుల్లో 7 చోట్ల సీఐటీయూ జెండాలు ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు ఎర్రజెండాలతో ర్యాలీ చేసి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు.

అనంతరం మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, భాగ్యలక్ష్మి, ఏవీ రమణ, బంగారు పాప, శంకరయ్య, చెన్నయ్య, రాంబాబు, గ్రామ సేవకులు నరసింహులు, ఆశా లీడర్ రమాదేవి, సిద్దమ్మలు మాట్లాడుతూ రైతుల వ్యవసాయ నల్లచట్టాలు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటుపరం చేయవద్దని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు అమలు చేసే వరకు ఐక్య ఉద్యమాలతో లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ, బ్యాంకింగ్, పోస్టల్, ఫుట్‌పాత్ వర్కర్స్ ఆటో, హమాలీ, బిల్డింగ్, అంగన్వాడీ, మున్సిపల్, ఆశా, మధ్యాహ్న భోజనం, ఆప్కాస్, సమగ్ర శిక్ష, బీడీ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల బలిదానమే మేడే



రాయచోటి: జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేస్తున్న ఏఐటీయూసీ జిల్లా నేతలు, రాజంపేట: జెండాను ఎగురవేస్తున్న కార్మిక సంఘం నాయకులు, రైల్వేకోడూరు: సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన దృశ్యం

హక్కుల పరిరక్షణ కోసం ఎంతోమంది కార్మికుల బలిదానమే మేడే అని పలువురు కార్మిక సంఘం నేతలు పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా పలుచోట్ల సంబరాలు చేసుకున్నారు. అనంతరం జెండాలు ఎగురవేసి కార్మిక సంఘాల నేతలతో మాట్లాడారు.

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడదామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, న్యాయవాది రెడ్డెయ్య, శంకర్‌నాయక్, నాగేశ్వరి, కేశవరావు, శేషాద్రి, హరి, వెంకటేశ్, సరోజ, సుజాత పాల్గొన్నారు.

రాజంపేట/రాజంపేటటౌన్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతోమంది కార్మికుల బలిదానం ఫలితమే మేడే అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, బస్టాండ్, సీఐటీయూ కార్మిక కార్యాలయాల్లో కార్మిక జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పలు కార్మిక సంఘం నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, లక్ష్మీదేవి, అంగన్వాడీ వర్కర్, యూనియన్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

పట్టణంలో భవన నిర్మాణ కార్మికుల సంఘాల నేతలు ఘనంగా మేడే సంబరాలను నిర్వహించారు. గురువారం రైల్వేస్టేషన్ సమీపం నుంచి పాతబస్టాండు కూడలి మీదుగా ఏఐటీయూసీ కార్యాలయం వద్ద కార్మిక జెండాను ఎగురవేశారు. ఏఐటీయూసీ సీపీఐ ఆధ్వర్యంలో జీఎంసీ క్లబ్‌లో సభ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎం.శివరామకృష్ణదేవర, సి.మహేష్, ఏఐటీయూసీ నేత ఇ.సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్ర, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రామాపురం: ప్రపంచ కార్మిక సమస్యలపై కలిసికట్టుగా ఏర్పాటు చేస్తున్న మేడేను విజయవంతం చేద్దామని మండల సీఐటీయూ నాయకుడు నాగబసిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం మేడే సందర్భంగా సీఐటీయూ జెండాను చేతబట్టారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె అంగన్వాడీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ నాయకురాలు ఓబులమ్మ, రామాపురం మండల నాయకురాలు చిట్టెమ్మ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరులో గురువారం సీపీఐ సీనియర్ నాయకులు తుమ్మల రాధాక్రిష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా ఆయా పార్టీల జెండాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కార్మికుల చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగదొక్కుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: కార్మికుల హక్కులను సాధించుకోవడమే మేడే లక్ష్యమని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కొత్త నాని, ఎదురూరి సుజాతలు అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయ సమీపంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య, జె.ఆంధ్రయ్య, గురువయ్య, ఆనందయ్య, మల్లికార్జున, మనోహర్, షాదక్‌బాషా, రాజా, సాదక్‌వల్లి, పెంచలయ్య పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మంగంపేటలోని ఏపీఎండీసీ సంస్థ ప్రాంగణంలో మేడే సందర్భంగా ఔట్‌సోర్సింగ్ ట్రైనీ కార్మిక పోరాట కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో పోరాట యూనియన్ నాయకులు, ఏపీఎండీసీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, త్రివేణి మైనింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిద్దవటం: రాయలసీమ ఆటోవర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన సిద్దవటం బస్టాండ్ కూడలిలో గురువారం జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఇమాం, కోశాధికారి, ఎన్‌వీ సుబ్బయ్య, కార్మికులు బాషా, చంటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరులో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు పి.రామయ్య అధ్యక్షతన మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. పెనగలూరు బస్టాండులోని మూడు రోడ్ల కూడలిలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వై.చలపతి, సభ్యులు హరినందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: మండలంలో గురువారం ఏఐటీయూసీ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ఏఐటీయూసీ నాయకురాళ్లు సరోజనమ్మ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. అలాగే బస్టాండులో అంగన్వాడీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు వనజ, సెక్టర్ లీడర్స్ చెంచులక్ష్మీ, నాగలత, రోజా, వీఆర్ఏ నాయకులు వెంకటసుబ్బయ్య, ఆటో యూనియన్ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న రాజకీయ ప్రముఖులు

రైల్వేకోడూరు, మే 1(ఆంధ్రజ్యోతి): గంగమ్మ జాతర సందర్భంగా గ్రామదేవతను గురువారం పలువురు రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. వీరిలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి, జనసేన పార్టీ నాయకుడు యనమల భాస్కర్‌రావు, తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన క్రమం తప్పకుండా అందిస్తున్న సామాజిక పింఛన్లు గ్రామీణ ప్రాంత నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. మేడే సందర్భంగా కార్మిక దినోత్సవాన్ని పురష్కరించుకుని గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని 28, 29 వార్డుల్లో సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పింఛనుదారులు పాల్గొన్నారు.

సీనియర్ టీడీపీ నేత మృతి



నాగిరెడ్డి సుబ్బారెడ్డి (ఫైల్)

నందలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ యల్లమరాజుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి సుబ్బారెడ్డి గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మండలంలోని పలువురు ప్రముఖులు, నాయకులు వారి ఇంటివద్దకు వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రతిపక్ష నేతలపై దాడి సిగ్గుచేటు

● అత్తింజేరి శ్రీనాథ్

రాజంపేటటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఆంధ్ర రత్న భవనంలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డిపై బీజేపీ నేతలు కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేయడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని అత్తింజేరి శ్రీనాథ్ అన్నారు. గురువారం సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి, భద్రతలు క్షీణించాయని తెలిపారు.

ఓ మోస్తారు చిరుజల్లులు

పెనగలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆకాశమంత మేఘావృతమై గాలులు వీచాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఎండ ఉష్ణోగ్రతతో తల్లడిల్లిన జనం సాయంత్రం హాయిగా గడిపారు.

విద్యార్థి ప్రతిభ



సిరాజ్ ఆనంద్

పుల్లంపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో దళవాయిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థి సిరాజ్ ఆనంద్ ప్రతిభ చూపాడు. 100 మార్కులకు గానూ 87 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపడం సంతోషంగా ఉందని ఉపాధ్యాయుడు రమణ తెలియజేశారు.

శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన యువత



శ్రీకాంత్‌రెడ్డిని కలిసిన యువత

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురం, సరస్వతినగర్, దూదేకులపల్లి, ఓంశాంతినగర్ తదితర ప్రాంతాలకు చెందిన యువత పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు గురువారం స్వచ్ఛందంగా తరలివచ్చి స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయనతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీకి వెన్నంటి ఉండి సేవ చేస్తామని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధికి కుట్టు శిక్షణ ఎంతో దోహదపడుతుందని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డ్వాక్రా సంఘాలతో సీఎం చంద్రబాబు మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు ప్రసాద్‌రాజు, శివరాంనాయుడు, సురేశ్‌నాయుడు, బెల్లాల రమణ, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబునాయుడు, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఏపీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ఇసుక ట్రాక్టర్లను అడ్డగించిన గ్రామస్థులు

సిద్దవటం, మే 1 (ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకుని అడ్డుకట్ట వేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహనిర్మాణానికి ఉచితంగా పెన్నా పరివాహక ప్రాంతాల్లో వినియోగించుకోవాలని ఆదేశించింది. ఉచిత ఇసుక ముసుగులో కొందరు ఆక్రమణదారులు మండలంలోని దేగనవారిపల్లె, టక్కోలి, మాచుపల్లె, లింగంపల్లె గ్రామాల పెన్నా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా కడపకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను గ్రామస్థులు మాచుపల్లె - కడప ప్రధాన రహదారిలో ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టక్కోలి గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి గురువారం మాట్లాడుతూ ఉచిత ఇసుక ముసుగులో ప్రతిరోజు దాదాపు 50 ట్రాక్టర్ల ద్వారా పెన్నా పరివాహక ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తరలించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారని, తద్వారా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయన్నారు. అధికారులు అక్రమంగా కడపకు ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు అడ్డుకట్ట వేయాలని మాజీ సర్పంచ్ క్రిష్టారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కులగణన హర్షణీయం

● బీసీ సంక్షేమ సంఘం జిల్లా నేతలు

రాయచోటిటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం త్వరలో దేశ వ్యాప్తంగా చేపట్టబోయే జాతీయ జనగణనతో పాటు కుల గణనను సైతం నిర్వహించాలనుకోవడం హర్షించదగ్గ విషయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు, గౌరవ సలహాదారు దువ్వూరి నరసింహాచారి, యువజన సంఘం పాలగిరి హబీబుల్లా, జిల్లా కమిటీ సభ్యులు పి.శ్రీనివాసులు, రాయచోటి నియోజకవర్గం అధ్యక్షుడు సంచుల ఖాదర్‌బాషా, తులసీరామ్‌లు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ మన దేశంలో జనాభా లెక్కల సేకరణ బ్రిటీష్ పాలనలో 1881లో మొదలైందని, అప్పటి నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి జనాభా లెక్కలను సేకరిస్తున్నారన్నారు. అప్పటి నుంచి నేటి వరకు బీసీల కులగణన జరగలేదని, ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే కులగణన చేస్తూ వస్తున్నారన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేపడతామని ప్రకటించడం సంతోషకరమైన విషయమన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

పరీక్ష ఫలితాలు విడుదల

పెనగలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఏప్రిల్ 21న రాసిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సహజబ్లెస్సీ తెలిపారు. ఫలితాలను పాఠశాల నోటీసుబోర్డులో ఉంచినట్లు ఆమె తెలిపారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సిద్దవటం, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి అన్నారు. మండలంలోని టక్కోలి గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛను కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో అమరావతి అధోగతి పాలైందని, ఏపీకి రాజధాని లేకుండా చేసిన ఘనత వారికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.

అభివృద్ధి టీడీపీకే సాధ్యం

సిద్దవటం, మే 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలోనే అమరావతి అభివృద్ధి సాధ్యమని టీడీపీ నేత చెంచయ్యనాయుడు అన్నారు. మండలంలోని భాకరాపేటలో గల తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇకనైనా వైసీపీ ప్రజా ప్రతినిధులు అభివృద్ధిని అడ్డుకోకుండా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

● డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ట్రాక్టర్

సంబేపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డిగారిపల్లె సచివాలయం ఎదురుగా గురువారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ కోనేటి రవికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... సంబేపల్లె గ్రామం నామాలగుట్టకు చెందిన డ్రైవర్ రవి కట్టాయి లోడ్ వేసుకొని సంబేపల్లె నుంచి రాయచోటి వైపు వెళ్తుండగా తమిళనాడు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ వెనుకవైపు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ట్రాక్టర్ 50 మీటర్ల దూరం వెళ్లి సైడ్ కాలువలో పడడంతో ట్రాక్టర్ పూర్తిగా దెబ్బతింది. ట్రాక్టర్ డ్రైవర్ రవి ప్రమాదం జరిగిన వెంటనే కిందకి దూకడంతో గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాదుల్లా తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు సాయి లోకేష్

ఓబులవారిపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లకుంట గ్రామ పంచాయతీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కొర్లకుంట గ్రామ పంచాయతీలో బీజేపీ మండలాధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గుండ్ల శంకరమ్మ కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ.1.27 లక్షలు, పోలి నరసారెడ్డి కుటుంబానికి రూ.1.70 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చెంగల్‌రెడ్డి, తోట శ్రీనివాసులు, బాలాజీ, రామక్రిష్టారెడ్డి, రవీంద్రారెడ్డి, శివ, వేణుగోపాల్‌రెడ్డి, చిన్నరెడ్డయ్య, అనిల్, పెంచలయ్య, సుబ్రమణ్యం, నరసారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా గాలీవాన



గాలివీడులో గాలి, వానకు రోడ్డుపై కూలిన చెట్లు

గాలివీడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం జోరుగా గాలీ, వాన కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ వేడిమి అధికంగా ఉండగా, ఆ తర్వాత వాతావరణం మారింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఆ తర్వాత ఈదురుగాలులతో ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో రాయచోటి ప్రధాన రహదారిపై పెద్ద వృక్షం నెలకొరగడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అంతేగాక మామిడి తోటలు నేలపాలయ్యాయి.

గురుకులంలో దరఖాస్తుల స్వీకరణ

సుండుపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లునాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ సుండుపల్లె గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మూడవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అలాగే నాలుగో తరగతి నుంచి 9వ తరగతి వరకు బ్యాక్‌లాగ్ ఖాళీలను నింపేందుకు ఈ నెల 1 నుంచి 20వ తేది వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9441146908, 9866624837 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాజధానికి తరలిన ప్రజలు

పెనగలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీడీవో ఎస్.విజయరావు అధ్యక్షతన మండల ప్రజలు గురువారం సాయంత్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో విజయవాడకు తరలివెళ్లారు. ఈ మహత్ కార్యాన్ని ప్రధానమంత్రి మరలా శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా ఆ కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించాలని సీఎం చంద్రబాబు కోరిక మేరకు ఎంపీడీవో అధ్యక్షతన ప్రజలతో పాటు పలు శాఖల అధికారుల బృందం బస్సుల్లో తరలివెళ్లారు.

బస్‌షెల్టర్ నిర్మాణం పరిశీలన



బస్సుషెల్టర్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీ

పుల్లంపేట, మే 1 (ఆంధ్ర జ్యోతి): పుల్లంపేట బైపాస్ రోడ్డులో ఎంపీ నిధులతో చేపట్టనున్న బస్సుషెల్టర్ నిర్మాణాన్ని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ షెల్టర్ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, ఎంపీపీ బాబుల్‌రెడ్డి కోరిక మేరకు అవసరమైతే అదనంగా మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తానన్నారు. బస్సుషెల్టర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, వైసీపీ నాయకులు కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సారధి తదితరులు పాల్గొన్నారు.

హైవేకు అడ్డంగా వృక్షాలు

● 4 కి.మీ. పొడవునా నిలిచిన వాహనాలు



ఎక్స్‌కవేటర్‌తో రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను తొలగిస్తున్న దృశ్యం

సిద్దవటం, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో గురువారం రాత్రి కురిసిన వర్షాలకు భాకరాపేట సమీపాన కాశినాయన గుడి భాకరాపేట గ్రామంలో నాలుగు వృక్షాలు హైవే రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో దాదాపు నాలుగు కి.మీ. రహదారి పొడవునా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, గ్రామ సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడులు జేసీబీ యంత్రంతో చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

హెచ్‌టీ పత్తిపై కత్తి

● ఆదిలోనే కట్టడికి కసరత్తు
● వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా





ప్రొద్దుటూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా పత్తి రైతులను వివిధ కంపెనీలు నిండా ముంచుతున్నాయి. జిల్లాలో పత్తిసాగును ఆసరాగా చేసుకుని వ్యాపారులు కల్తీ విత్తనాలతోపాటు హెచ్‌టీ విత్తనాలను అంటగడుతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గత వారం రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెర్బిసైడ్ టోలరెంట్ (హెచ్‌టీ పరీక్ష) పత్తి విత్తనాల నాణ్యత, ప్రమాణాల పరీక్ష చేపట్టారు. హెచ్‌టీ టెస్ట్ పరీక్షించగా నెగిటివ్ (హెచ్‌టీ జన్యు లేకుండా కేవలం కంట్రోలైన్) మాత్రమే కనిపిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ర్యాండంగా తనిఖీలు చేపట్టి ధ్రువీకరణలు చేస్తున్నారు.

పత్తి రైతుకు ఒకవైపు ప్రతికూల వాతావరణం, తెగుళ్లతో అష్టకష్టాలు పడి సాగు చేస్తే చివరకు ధర లేక నష్టాలు తప్పడం లేదు. విత్తు నాటిన మొదలు నుంచి సుమారు అయిదు నెలలపాటు సాగే ఈ పంట మూడుసార్లు దిగుబడినివ్వగా పంటను రక్షించుకునేందుకు పురుగుల మందులను చల్లుతూ, కాపాడుకుంటూ చివరికి దిగుబడి చేతికందాక సరైన మద్దతు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పైగా బ్రాండ్ల పేరుతో కొంతమంది వ్యాపారులు ఎమ్మార్పీ ధరలను పెంచడంతో రైతులకు భారంగా మారింది. 475 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర గత ఏడాది రూ.864 ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 901 రూపాయలకు ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు.

ఏటా తగ్గుతున్న సాగు

అష్టకష్టాలు పడి చీడ, పురుగుల భారీ నుంచి తప్పించి చివరకు దిగుబడి వచ్చినా పంటకు సరైన మద్దతు ధర లేక జిల్లాలో పత్తి సాగు ఏటా గణనీయంగా పడిపోతోంది. 2023 సంవత్సరంలో 22 వేల హెక్టార్లకుపైగా సాగైన పత్తి 2004 సంవత్సరంలో 13వేల హెక్టారులకు పడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 13వేల హెక్టార్ల మేర పంట సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని నల్లరేగడి ప్రాంతాలు అయిన వేముల, వేంపల్లె, రాజుపాళెం, పులివెందుల, వల్లూరు, వీరపునాయునిపల్లె, పెద్దముడియం, కమలాపురం, తదితర మండలాల్లో రైతులు పత్తి సాగుకు సమాయత్తం అవుతున్నారు. నీటి లభ్యత, తొలకరి వర్షాల నేపథ్యంలో సాగును ప్రారంభించనున్నారు.

కలుపు నివారించవచ్చని..

హెచ్‌టీ పత్తి పొలంలో వేస్తే కలుపు నివారణ మందులు చల్లడానికి వెసులుబాటు ఉంది. కూలీలతో కలుపు తీయించే అవసరం ఉండదు. దీని వలన పర్యావరణానికి అనేక సమస్యలు వస్తుండడంతో ప్రభుత్వం నిషేధించింది. అనుమతి లేకపోయినా కొందరు రైతులు కలుపు సమస్య తగ్గుతుందని, దీనిపై మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. పత్తి విత్తనాలు నాటడం పూర్తయ్యే వరకు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు కూడా తనిఖీలు చేసేలా అన్ని మండలాలకు పరీక్షా కిట్లను అధికారులు అందజేస్తున్నారు. హెచ్‌టీ పత్తి సాగు కట్టడికి వ్యవసాయ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.



విత్తనాలకు హెచ్‌టీ పరీక్ష చేస్తున్న అధికారులు

ఆదిలోనే కట్టడికి కసరత్తు

ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పత్తి సాగులో హెచ్‌టీ కలిగిన పత్తి విత్తనాలు రైతులకు అందకుండా వ్యవసాయశాఖ అప్రమత్తం అయింది. హెచ్‌టీ పత్తి విత్తనాల ఉత్పత్తి సాగు, అమ్మకాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసిందే. వీటి సాగు వలన పర్యావరణానికి హాని కలుగుతుందని గుర్తించి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. విత్తనాల తయారీ, సరఫరా సమయంలోనే అడ్డుకట్ట వేస్తే రైతులకు సరఫరా కాకుండా నియంత్రించవచ్చునని లక్ష్యంతో వ్యవసాయశాఖ ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలు చేయిస్తోంది. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాలో గత మూడు రోజులుగా ప్రత్యేక బృందాలు ఇన్‌స్టాంట్ కిట్లను ఉపయోగించి వివిధ కంపెనీల పత్తి విత్తనాలను పరిశీలిస్తున్నారు. వేంపల్లె, పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు, రాజుపాళెం, దువ్వూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు మండలాల్లో వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. 25 రకాల పత్తి విత్తనాలను పరిశీలించగా హెచ్‌టీ పత్తి లేదని తేలింది. విత్తన పంపిణీ చేసే కంపెనీల గోదాములు, కంపెనీదారులు, రీటైల్ డీలర్లు, దుకాణాలు, తదితర వాటిల్లో తనిఖీలు చేస్తున్నారు. అక్కడక్కడ నమూనాలను సేకరించి హెచ్‌టీ జన్యు పరీక్షలు చేసి హెచ్‌టీ ఉందా? లేదా? అని నిర్ధారిస్తున్నారు.

పోటాపోటీగా బండలాగుడు పోటీలు



విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

వల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా పుష్పగిరి కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఈ పోటీల్లో కడపకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.60116ల బహుమతి అందుకున్నారు. అనంతపురం జిల్లా కొత్తపల్లెకు చెందిన గౌతంరెడ్డి ఎద్దులు రెండో స్థానంలో నిలిచి బహుమతి కింద రూ.40116లు గెలుచుకోగా, అనంతపురం జిల్లా వరదాయపల్లె శ్రీరాములుకు చెందిన ఎద్దులు మూడో బహుమతి రూ.20116, వల్లూరు మండలం జ్యోతువాలరిపల్లె చెందిన వెంకటరమణారెడ్డి ఎద్దులు నాలుగో బహుమతి రూ.10,116లు గెలుచుకున్నాయి. ఎడ్ల యజమానులకు వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, గడికోట సుధాకర్‌రెడ్డి, శివారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. అలాగే ఐదు నుంచి ఎనిమిది స్థానాలకు వరకు నిలిచిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతులు ఇచ్చారు. కాగా, వచ్చే సంవత్సరం బండలాగుడు పోటీల్లో విజేతకు వల్లూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన టీడీపీ నేత రామసుబ్బారెడ్డి రూ.లక్షా116లు అందజేస్తామని తెలపడంతో అక్కడున్న ఎద్దుల యజమానులు, పోటీలు తిలకిస్తున్న ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మెడతోటి మూర్తి మృతదేహం

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాచుపల్లె వద్ద కడప - కర్నూలు జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడతోటి మూర్తి (18) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక కొత్తగాంధీనగర్‌కు చెందిన మెడతోటి మూర్తి తమ సొంత పనుల నిమిత్తం చిన్నమాచుపల్లె వద్దకు వెళ్లి పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి చెన్నూరు వైపు వేగంగా వస్తున్న ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆ యువకుడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తలరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరు గుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని.. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు బ్రహ్మంసాగర్‌లో వ్యక్తి...



బ్రహ్మంసాగర్‌లో నుంచి వెలికితీసిన మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 1 (ఆంధ్ర జ్యోతి): బ్రహ్మంసాగర్ రిజర్వా యరులో ప్రమాదవశాత్తు సుబ్బాచారి రాజగోపాలచారి (65) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా హోసోరు టౌనుకు చెందిన రాజ గోపాలచారితో పాటు 25మంది టూరిస్టులు బుధవారం బ్రహ్మంగారి మఠం వచ్చారు. దైవదర్శనం అనంతరం విహార యాత్రకు బ్రహ్మంసాగర్ వద్దకు వెళ్లారు. రాజ గోపాలచారి నీటిలో స్నానం చేయడానికి దిగడంతో గల్లంత య్యాడు. అతని కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం నుంచి గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది కలిసి వెతికి మృత దేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రిమ్స్ వద్ద గుర్తు తెలియని మహిళ...

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన మహిళ వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు 9121100523, 9121100524కు ఫోను చేసి తెలుసకోవచ్చన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీ వద్ద ఉంచినట్లు తెలిపారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

● 61 గ్రాముల వెండి, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం



పట్టుబడ్డ దొంగల ముఠాను చూపుతున్న రాయచోటి అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయచోటి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వరుస దొంగతనాల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రాయచోటి అర్బన్ పోలీసులు అంతర్ జిల్లాల దొంగల ముఠాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 61 గ్రాముల వెండి వస్తువులతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ సీఐ బీవీ చలపతి వివరాలను వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గడ్డం బసిరెడ్డి ఇంట్లో గత నెల 16వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంత మంది గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి బంగారు, వెండి వస్తువులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్ జిల్లాల దొంగల ముఠాకు చెందిన అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందియ బోయరాజు, ఉప్పొంక గ్రామానికి చెందిన బొట్ట నారాయణ అలియాస్ దశరథ, గుమ్మగట్ట మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎరుకుల రామకృష్ణ, ఎరుకుల రమేశ్, అనంతపురం టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బోయ సంజీవ్‌కుమార్, ఉరవకొండ మండలం చిన్నముస్తూరు గ్రామానికి చెందిన నేసే సోమశేఖర్ అలియాస్ సోములను గురువారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించి రాయచోటి అర్బన్ ఎస్‌ఐ అబ్దుల్ జహీర్, జిల్లా క్రైమ్ పార్టీ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డిలు సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి వెండి వస్తువులను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు. వీరి ముఠాలో పవన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు.

గండి ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరం

● ఎంపీ అవినాశ్‌రెడ్డి

చక్రాయపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు గండి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 80శాతం పనులు పూర్తి చేశారని, అయితే చిన్నచిన్న పనులు కూడా పూర్తి చేసి టీడీపీ ప్రభుత్వం ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరమని ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని కుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గండి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరి, రాజారమేష్‌లు పూజలు చేయించి సన్మానించారు. అనంతరం గండి ఆలయాన్ని పరిశీలించి ఆలయాన్ని ప్రారంభించకపోవడానికి కారణాలేమిటని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యాన్నదాన పథకం కూడా బాగా జరుగుతోందా అని వాకబు చేశారు. ఏపీ టూరిజం కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జడ్పీటీసీ శివారెడ్డి, ఎంపీపీ మాధవి, వైసీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, హరి, జనార్దన్‌రెడ్డి, గంగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం పొడిగింపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ (పీఏఈసీఎస్)ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్టీ నెంబర్ 229ని జారీ చేసింది. వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లె సొసైటీకి కె.నాగరత్నమ్మ, గోనుమాకులపల్లెకు యూసీ వెంకటసుబ్బయ్య, కె.అగ్రహారం సొసైటీకి వి.వేణుమాధవరెడ్డి, దువ్వూరుకు ఎ.రాజశేఖర్, మైదుకూరు ఎఫ్‌ఎస్సీఎస్‌కు ఎం.బ్రహ్మానందరెడ్డిని కొనసాగించారు. తాళ్లప్రొద్దుటూరు ఎఫ్‌ఎస్సీఎస్‌కు ఇప్పటి వరకు ఉన్న ఎంవీ ప్రభాకర్‌రావు స్థానంలో ఎ.రాజశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థికి బంగారు పతకం



ఉదయ్‌శంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజంపేటటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థి ఎస్.ఉదయ్‌శంకర్ డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురుగన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదు సమీపంలోని నల్గొండలో గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో డిస్కస్‌త్రోలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాజంపేట కేంద్రీయ విద్యాలయం పదో తరగతి విద్యార్థి ఉదయ్ శంకర్‌కు బంగారు పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయం వ్యాయా మ ఉపాధ్యాయుడు రాహుల్‌కుమార్ ఆ విద్యార్థిని అభినందించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అదృశ్యం

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఒంగోలు క్యాంపస్‌లో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. నాలుగురోజుల క్రితం ట్రిపుల్‌ఐటీ నుంచి ఆ విద్యార్థిని వెళ్లిపోయినట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ విద్యార్థిని కోసం గాలిస్తున్నారు. గుంటూరుకు చెందిన విద్యార్థిని వేరొక విద్యార్థినికి చెందిన సెల్‌ఫోన్ తీసుకెళ్లడంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో భయాందోళనకు గురైన గుం టూరుకు చెందిన విద్యార్థిని నాలుగురోజుల క్రితం ట్రిపు ల్‌ఐటీ నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లకపోవడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బైకును ఢీకొన్న కారు.. తండ్రీకొడుకులు మృతి





ఆసుపత్రిలో మృతి చెందిన సాధిక్

ముద్దనూరు మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని మునయ్యకోన సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందారు. పోలీసుల వివరాలమేరకు... కొండాపురం మండలం చౌటిపల్లెకు చెందిన హాజీ మహమ్మద్ (40) కుమారుడు సాధిక్ (4)తో ఉరుసు ఉత్సవానికి అత్తగారిపల్లె ఇంటికి జమ్మలమడుగుకు కుటుంబంతో వెళ్లాడు. సాయంత్రం చౌటిపల్లెకు తిరిగి బైకుపై వస్తుండగా మునయ్య కోన సమీపంలో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాలుడు సాధిక్ మృతి చెందాడు. హాజీ మహమ్మద్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఎద్దుల కొండ ఆలయంపై పిడుగుపాటు

● దెబ్బతిన్న దేవతామూర్తుల విగ్రహాలు



పిడుగుపాటుకు ఆలయ రాజగోపురం పైనుంచి కింద పడ్డ విగ్రహాలు

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నదీ ఒడ్డున ఎద్దులకొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపడింది. బుధవారం రాత్రి ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఆలయ రాజగోపురంపై పిడుగు పడింది. దీంతో అక్కడ దేవతామూర్తుల, ఇతర శిల్పాలు దెబ్బతిని ముక్కలుగా కిందపడ్డాయి. ఈ విషయాన్ని అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తదితరులు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, పూజారి హరిప్రవీణ్‌లకు తెలిపారు. గురువారం ఉదయం ఆలయాన్ని సందర్శించిన ఈఓ, పూజారిలు పిడుగుపాటుకు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. కాగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆలయాన్ని సందర్శించి పిడుగుపాటుకు దెబ్బతిన్న గోపురాన్ని పరిశీలించారు. ఆలయ సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించాలని కోరారు.

లేబర్ కోడ్ల రద్దుకు పోరాడదాం

- కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలి
- మేడే వేడుకల్లో కార్మిక నేతల పిలుపు



మదనపల్లె పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె/మదనపల్లె అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదామని ఏఐటీయూసీ, సీఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయా సంఘాల నేతలు, కార్మికులు పట్టణంలోని వాడవాడలా మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూసీ నాయకులు వి.సురేష్‌కుమార్, పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు వేర్వేరుగా జెండాలను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్ల రద్దుకు పోరాడదామని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు పనిభారాన్ని తగ్గించాలని, తదితర డిమాండ్లపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం చలపతిరావు కాలనీలో జెండా ఆవిష్కరించి మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు టి.కృష్ణప్ప, మురళి, ముభారక్, తిరుమలప్ప, దేవా, ఇంద్రాణి, సంజీవ, పృథ్విరాజ్, సంజీవ, మిఠాయి శీనా, ఉమారాణి, శంకర్ ప్రసాద్, శేఖర్, నందు, రాధా పాల్గొన్నారు.

అలాగే పట్టణంలోని సీటీఎం రోడ్డులోని గ్రంథాలయం మైదానంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలు సంయుక్తంగా మేడే వేడుకలు నిర్వహించాయి. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రమణరావు, టి.హరింద్రనాథ్‌శర్మ, పి.రాజేశ్వరి, మధురవాణి, రామకృష్ణ, కృష్ణమూర్తి ప్రసంగించారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పీలేరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి); అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ పీలేరు నియోజక వర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్, పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం పీలేరులో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో కార్మికుల పోరాటం ఫలితంగా 8 గంటల పని విధానం సాధించుకున్నందుకు ప్రపంచ వ్యాప్తంగా కులమతాలకు అతీతంగా మే 1వ తేదీన మేడేగా జరుపుకుంటున్నామన్నారు. పట్టణంలో సీఐటీయూసీ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ జెండాను మార్కెట్ కమిటీ చైర్మన్ రామమూర్తి ఎగురవేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటపల్లె బాబురెడ్డి, సురేంద్ర, సర్పంచ్ హబీబ్‌బాషా, రాధాక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బహుజన బిల్డింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో..

బహుజన బిల్డింగ్ వర్కర్స్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బలరాం ఆధ్వర్యంలో మేడే సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే గేటు నుంచి ఎల్‌బీఎస్ మార్గంలోని పంచాయతీ కార్యాలయం, ఆర్టీసీ బస్టేషన్ మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, మహాత్మ జ్యోతీరావు పూలే, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.


పీలేరు ఏఐటీయూసీ కార్యాలయం వద్ద..

కార్యక్రమంలో రామయ్య, మస్తాన్, శ్రీరాములు, చెంగల్‌రాయుడు, రసూల్‌బాషా, ఆలీబేగ్, ప్రభాకర్‌రాజు, ఆంజనేయులు, షణ్ముఖం, హరీష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములను అభివృద్ధి చేయాలి

నిమ్మనపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దళితుల భూములను ఉపాధి పనుల ద్వారా అభివృద్ధి చేయాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ పేర్కొన్నారు. గురువారం రాచవేటివారిపల్లి పంచాయతి దిగువ మాచిరెడ్డిగారిపల్లి సమీపంలో ఉపాధి కూలీలతో మేడే నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు ఉపాధి పనులు చేసి మూడు నెలలు కావస్తున్నా బిల్లులు ఇవ్వలేదని వాపోయారు. కార్యక్రమంలో రామయ్య, ఎల్లక్క, యమున, రామకృష్ణపాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, అంబేద్కర్, పాతకోట ఆటోయూనియన్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో జనసేన ఇన్‌చార్జి సాయినాథ్, సీఐ లక్ష్మన్న, తహసీల్దార్ ప్రదీప్, నియోజవకర్గ ఏఐటీయూసీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఏయూటీసీ కార్యదర్శి సలీంబాషా, సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప తదితరులు జెండాను ఆవిష్కరించారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ జరిగింది. కార్యక్రమాల్లో నాయకులు ఖాదర్‌బాషా, రఫీ, పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెలో మేడేను పలు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పౌర సరఫరాల శాఖ గోదాం వద్ద సివిల్ సప్లైస్ హమాలీలు, విద్యుత్ ఉపకేంద్రాల్లో సిబ్బంది, హరిత కూడలిలో ఆటో యూనియన్ కార్మికులు, నాయకులు కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. జ్యోతిచౌక్, దిగువ బస్టాండులో వేర్వేరుగా ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాలలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వేమనారాయణ, మనోహర్‌రెడ్డి, సలీంబాష, వేణుగోపాల్‌రెడ్డి, బషీర్‌ఖాన్, తంబయ్యశెట్టి, రఘునాథ్, గఫూర్, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కోసం బీజేపీ కట్టుబడి ఉంది

బి.కొత్తకోట, మే 1(ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికుల సంక్షేమం కోసం నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం కట్టుబడి వుందని శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు పార్థసారథి పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట నగరపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను మేడే సందర్భంగా దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఏవో రమాదేవి, బీజేపీ నాయకులు రమేష్, ముకుంద, శీలంరంగారెడ్డి, కావడి రవీంద్ర, మురళీ, నాగరాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములు ఆక్రమిస్తే చర్యలు


వివరాలు సేకరిస్తున్న సీఐడీ డీఎస్పీ కొండయ్యనాయుడు

కలకడ, మే 1(ఆంధ్రజ్యోతి): కలకడ మండల పరిధిలో వున్న అగ్రిగోల్డ్ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐడీ డీఎస్పీ కొండయ్యనాయుడు హెచ్చరించారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత భూమి రికార్డుల గురించి రెవెన్యూ సిబ్బందితో చర్చించారు. మండలంలోని బాలయ్యగారిపల్లి, గుడిబండ, కె.దొడ్డిపల్లి గ్రామాలలో ఇదివరకే 237 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. త్వరలో రెవెన్యూ అధికారులతో కలిసి ఆ భూములను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

వాల్మీకిపురం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వాల్మీకిపురానికి రానున్నట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కంభం నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం 11గంటలకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి కమిటీ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమాలకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ములకలచెరువులో 20 మి.మీ. వర్షం

ములకలచెరువు, మే 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన అకాల వర్షానికి ప్రధాన రహదారులలో వర్షపునీరు భారీగా ప్రవహించాయి. అలాగే మురికికాలువలు పొంగిపొర్లాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. పాత ములకలచెరువు పంచాయతీ రామాపురంలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విత్యుత్ సరఫరా నిలిచిపోయింది. ములకలచెరువులో కురిసిన వర్షం 20మి.మీటర్లుగా నమోదైంది.

వాయల్పాడు వైద్య ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కలికిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): వాయల్పాడు తాలుకా యూనిట్ వైద్య ఉద్యోగుల సంఘం ఎన్నికలు గురువారం కలికిరిలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరావు వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా బి.నాగరాజ, ఉపాధ్యక్షులుగా రమణనాయక్, గంగాధర్, ముజీబ్ బాషా, కార్యదర్శిగా సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.రాజమ్మ, ఎం.సందీప్, ఎం.భాగ్యలక్ష్మి, కోశాధికారిగా టి.సరోజమ్మతో పాటు మరో 17 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరువర్గాలు ఘర్షణపడిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. కురబలకోట మండలం బాపణపల్లెకు చెందిన నరసింహులు, అతని భార్య గురువారం టమోటా చెట్లు నాటుటకు పొలం వద్ద బోరు వదిలి ఉండగా ప్రత్యర్థులు సుధాకర్, వెంకటేష్, లక్ష్మీదేవి, గోపాలమ్మ అక్కడకు చేరుకుని మోటర్ ఫీజుల తీసేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో నరసింహులు, అతని భార్యను కర్రలతో కొట్టి గాయపర్చారు. దీంతో వెంకటేష్‌కు స్వల్ప గాయాలు కాగా నరసింహులు తలకు తీవ్ర గాయమైంది. ఇరువర్గాలు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఈమేరకు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

10లీటర్ల సాటుసారా స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, మే 1(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న ఒక వక్తిని పట్టుకొని అతని వద్ద నుండి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లికి చెందిన పెద్దరామయ్య కుమారుడు లక్ష్మయ్య తన ఇంటి వద్ద నాటుసారాను అమ్ముతుండగా సిబ్బందితో కలసి దాడులు చేసి పట్టుకున్నామన్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ముగిసిన మహాభారతం

కలికిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిది రోజులుగా కలికిరి అంకాలమ్మ గుడి ఆవరణలో జరుగుతున్న మహాభారత కథ చివరి రోజున ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. గురువారం దుర్యోధన వధ ప్రదర్శనతో ఈ ప్రదర్శన ముగిసింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆసాంతం తిలకించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో భాగవతారిణి జ్యోత్స్న, వెంకటేశ్వర నాట్య కళామండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలన్నీ ఉండాలి

- ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

కలికిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): పీలేరు, కలికిరి, వాల్మీకిపురంలోని మూడు ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ప్రభుత్వం మంజూరు చేసేటట్లు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. గురువారం స్థానికి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మూడు ఆసుపత్రులూ తమకు ప్రతిష్ఠాత్మకమైనవని స్పష్టం చేశారు. ఈజీఎస్‌లో అసంపూర్తిగా వున్న ప్రహరీ గోడను నిర్మించాలన్నారు. ఆసుపత్రి మధ్యలో వెళుతున్న పెద్ద కాలువ కారణంగా దోమల బెడద అధికంగా ఉందని వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ సమావేశం దృష్టి తెచ్చారు. దీంతో పంచాయతీ నిధుల నుంచి కాలువను పునర్‌నిర్మించాలని కార్యదర్శి అశోక్, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డిని ఆదేశించారు. రోగులను అనవసరంగా రెఫరల్ పేరుతో బయటకు పంపొద్దని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వంద శాతం ప్రసవాలు స్థానిక ఆసుపత్రుల్లోనే జరగాలన్నారు. ఈ సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ వెంకట్రమణా రెడ్డి, లేపాక్షి అస్లామ్, కె.గీత, ఎంపీడీవో భానుమూర్తి, కార్యదర్శి అశోక్, యోగేష్ రెడ్డి, డీఈ కరీముల్లా, వైద్యులు ఉదయ్‌కిరణ్, వెంకటేష్, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు మరిన్ని సంక్షేమ పథకాలు

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్లన్నీ మూతబడ్డాయని, వారికి ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కాలేదని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో అన్ని కార్పొరేషన్లు సంక్షేమ కార్యక్రమాల కోసం తిరిగి ఊపిరి పోసుకున్నాయన్నారు. కలికిరిలో 140మంది బీసీ మహిళలకు కుట్టుమిషన్లు అందుబాటులో వుంచి ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక షాదీ మహల్‌లో ఆయన గురువారం ప్రారంభించారు. శిక్షణ పూర్తయిన అనంతరం అందరికీ ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, మాజీ జడ్పీటీసీ మాలతి, యోగేష్ రెడ్డి, వాసునూరి చంద్రశేఖర్, వర్మ, ఎంపీడీవో భానుమూర్తి రావు, కార్యదర్శి అశోక్, ఏపీవో మంజుల పాల్గొన్నారు.


ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల పెంపు


ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

తంబళ్లపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధి ఏపీడీ నందకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏపీవో అంజినప్పతో కలసి తంబళ్లపల్లెలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్లతోటలలో తవ్వుతున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలో 25 చొప్పున ఇంకుడు గుంతలను తవ్వించాలన్నారు. ఇందులో పండ్లతోటలలో ఇంకుడు గుంతలు తవ్వడానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ఉపాధిలో పండ్లతోటల పెంపకంతో పాటు పశుగ్రాసం గడ్డి పెంచుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ మహేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు


మార్కెట్ యార్డు వద్ద రోడ్డుపైకి కొట్టుకొచ్చిన రేకులషెడ్

గుర్రంకొండ, మే 1(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. అలాగే గాలి వానకు మార్కెట్ యార్డు వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో రేకులషెడ్లు రోడ్డుపైకి కొట్టుకొచ్చాయి. ఓ రేకుల షెడ్ మార్కెట్ యార్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్తంభంపై పడడంతో సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయి. అలాగే గుర్రంకొండ-వాల్మీకీపురం రోడ్డులోని తలారివాండ్లపల్లె వద్ద వృక్షాలు రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాలివానతో సరిమడుగు, సంగసముద్రం, గుర్రంకొండ గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. గాలివానతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

పారిశుధ్య కార్మికులకు గ్లౌజుల పంపిణీ

మదనపల్లె అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): మే డే సందర్భంగా మదనపల్లె మండలం కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య కార్మికులకు దుస్తులు, మాస్, గ్లౌజులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ కార్మికులు తమ రక్తాన్ని స్వేదంగా మార్చి అవరోధాలను అభివృద్ధికి మెట్లుగా మారుస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కురువంక పంచాయతీ పరిధిలో శానిటేషన్, నీటి, విద్యుత్ సమస్యలు రాకుండా ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలుగకుండా పని చేస్తున్న కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కురవంక పంచాయతీ కార్యదర్శి షబానా, ఉపసర్పంచ్ నాగరాజ, వార్డు మెంబరు కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలి

- జడ్జి కీర్తన

మదనపల్లె అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి) కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని మదనపల్లె రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.కీర్తన అన్నారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ గురువారం మేడే ఘనంగా నిర్వహించారు. ముందుగా జడ్జి కీర్తనకు మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. శ్రీనివాసులు, కార్యదర్శి ఎస్.రెడ్డిసాహెబ్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జడ్జి కీర్తన మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులను పోరాటం ద్వారా సాధించుకోవాలన్నారు. కార్మికులంతా సంఘటితం కాలవాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ భవణ నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయం కోసం స్థలం అడిగారని, కలెక్టర్‌తో చర్చించి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కార్యదర్శి రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా వెంటనే నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుసేన్, సీపీఐ మురళీ, మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొటుకు రమణ, మోహిద్దీన్ బాషా, రామాంజులు, పి.వెంకటరమణ, అమరనాధ, నారాయణ స్వామి, రమణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


జడ్జి కీర్తనకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మదనపల్లె బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు

పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ములకలచెరువు/పెద్దతిప్పసముద్రం/బి.కొత్తకోట, మే 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేవళచెరువులో గురువారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్మికులకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు. అలాగే అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి కార్యాక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ప్రజలు, కార్యకర్తల బస్సును ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో హరినారాయణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఆంజనేయరెడ్డి, కేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే పెద్దతిప్పసముద్రం మండలంలోని సంపతికోట గ్రామంలో, బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలో ఆమె ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను స్థానిక కూటమి నేతలతో కలసి పంపిణి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నరెడ్డెప్ప, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సంపతికోట కిట్టన్న, కట్టా సురేంద్రనాయుడు, మొటుకుశివ, రెడ్డెప్ప, నరసింహారెడ్డి, నాగలాంబిక, గంజి మోహన పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి

కుల గణనతో బహుజనులకు న్యాయం

మదనపల్లె అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో బహుజనులకు న్యాయం జరుగుతుందని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్, బీజేపీ నేత బండి ఆనంద్ అన్నారు. దేశంలో జనగణనతో పాటు అణగారిన వర్గాల అభివృద్ధి జరగాలంటే కులగణన అవసరమని ప్రధాని మోదీ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు సమాపంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జబ్బల శ్రీనివాసులు, భువనేశ్వర్‌సత్య, మఠం కిరణ్, బాలకృష్ణ, శ్రీకాంత్, కిరణ్, బీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్, చేనేత నాయకులు నాగరాజ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మోటర్ వెలికితీత


పీటీఎంలో పంచాయతీ బోరును వెలికి తీసిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం, మే 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పీటీఎంలోని పెద్దకాలువగడ్డ వద్ద ఉన్న పంచాయతీ తాగునీటి బోరులో నాలుగు సంవత్సరాల క్రితం మోటర్, పంప్‌సెట్‌తో పాటు బోరు మోటర్‌కు అమర్చే 25 పైపులు ఇరుక్కుపోవడంతో పంచాయతీ కార్మికులు, అధికారులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాక వదిలేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి చింతామణిలో ఉన్న బోరు మెకానిక్‌లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కెమెరాల సహాయంతో స్కానింగ్ చేసి నాలుగు రోజులు శ్రమించి గురువారం మోటర్, 25 పైప్‌లను వెలికితీశారు. దీంతో పీటీఎం వాసులకు మంచినీటి సమస్య తిరినట్టేనని గ్రామస్తులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఎన్‌టీయూసీ ఐడీకార్డుల పంపిణీ

మదనపల్లె, మే 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. స్థానిక టమోటా మార్కెట్‌లో గురువారం టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్.ఎ.మస్తాన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా హాజరై కార్మికులకు ఐడీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు రామయ్య కార్యదర్శి మహబూబ్ బాషా, చలపతి, సుధాకర్, షామీర్, షకూర్, కార్మికులు పాల్గొన్నారు.


కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హెచ్‌టీ పత్తిపై కత్తి

- ఆదిలోనే కట్టడికి కసరత్తు
- వ్యవసాయ శాఖ ప్రత్యేక నిఘా





ప్రొద్దుటూరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏటా నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా పత్తి రైతులను వివిధ కంపెనీలు నిండా ముంచుతున్నాయి. జిల్లాలో పత్తిసాగును ఆసరాగా చేసుకుని వ్యాపారులు కల్తీ విత్తనాలతోపాటు హెచ్‌టీ విత్తనాలను అంటగడుతున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గత వారం రోజులుగా వ్యవసాయశాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. హెర్బిసైడ్ టోలరెంట్ (హెచ్‌టీ పరీక్ష) పత్తి విత్తనాల నాణ్యత, ప్రమాణాల పరీక్ష చేపట్టారు. హెచ్‌టీ టెస్ట్ పరీక్షించగా నెగిటివ్ (హెచ్‌టీ జన్యు లేకుండా కేవలం కంట్రోలైన్) మాత్రమే కనిపిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ర్యాండంగా తనిఖీలు చేపట్టి ధ్రువీకరణలు చేస్తున్నారు.

పత్తి రైతుకు ఒకవైపు ప్రతికూల వాతావరణం, తెగుళ్లతో అష్టకష్టాలు పడి సాగు చేస్తే చివరకు ధర లేక నష్టాలు తప్పడం లేదు. విత్తు నాటిన మొదలు నుంచి సుమారు అయిదు నెలలపాటు సాగే ఈ పంట మూడుసార్లు దిగుబడినివ్వగా పంటను రక్షించుకునేందుకు పురుగుల మందులను చల్లుతూ, కాపాడుకుంటూ చివరికి దిగుబడి చేతికందాక సరైన మద్ధతు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పైగా బ్రాండ్ల పేరుతో కొంతమంది వ్యాపారులు ఎమ్మార్పీ ధరలను పెంచడంతో రైతులకు భారంగా మారింది. 475 గ్రాముల విత్తన ప్యాకెట్ ధర గత ఏడాది రూ.864 ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో 901 రూపాయలకు ధర పలుకుతోందని రైతులు వాపోతున్నారు.

ఏటా తగ్గుతున్న సాగు

అష్టకష్టాలు పడి చీడ, పురుగుల భారీ నుంచి తప్పించి చివరకు దిగుబడి వచ్చినా పంటకు సరైన మద్దతు ధర లేక జిల్లాలో పత్తి సాగు ఏటా గణనీయంగా పడిపోతోంది. 2023 సంవత్సరంలో 22 వేల హెక్టార్లకుపైగా సాగైన పత్తి 2004 సంవత్సరంలో 13వేల హెక్టారులకు పడిపోయింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 13వేల హెక్టార్ల మేర పంట సాగు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలోని నల్లరేగడి ప్రాంతాలు అయిన వేముల, వేంపల్లె, రాజుపాళెం, పులివెందుల, వల్లూరు, వీరపునాయునిపల్లె, పెద్దముడియం, కమలాపురం, తదితర మండలాల్లో రైతులు పత్తి సాగుకు సమాయత్తం అవుతున్నారు. నీటి లభ్యత, తొలకరి వర్షాల నేపథ్యంలో సాగును ప్రారంభించనున్నారు.

కలుపు నివారించవచ్చని..

హెచ్‌టీ పత్తి పొలంలో వేస్తే కలుపు నివారణ మందులు చల్లడానికి వెసులుబాటు ఉంది. కూలీలతో కలుపు తీయించే అవసరం ఉండదు. దీని వలన పర్యావరణానికి అనేక సమస్యలు వస్తుండడంతో ప్రభుత్వం నిషేధించింది. అనుమతి లేకపోయినా కొందరు రైతులు కలుపు సమస్య తగ్గుతుందని, దీనిపై మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు. పత్తి విత్తనాలు నాటడం పూర్తయ్యే వరకు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు కూడా తనిఖీలు చేసేలా అన్ని మండలాలకు పరీక్షా కిట్లను అధికారులు అందజేస్తున్నారు. హెచ్‌టీ పత్తి సాగు కట్టడికి వ్యవసాయ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేస్తోంది.



విత్తనాలకు హెచ్‌టీ పరీక్ష చేస్తున్న అధికారులు

ఆదిలోనే కట్టడికి కసరత్తు

ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పత్తి సాగులో హెచ్‌టీ కలిగిన పత్తి విత్తనాలు రైతులకు అందకుండా వ్యవసాయశాఖ అప్రమత్తం అయింది. హెచ్‌టీ పత్తి విత్తనాల ఉత్పత్తి సాగు, అమ్మకాలను కేంద్ర ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసిందే. వీటి సాగు వలన పర్యావరణానికి హాని కలుగుతుందని గుర్తించి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. విత్తనాల తయారీ , సరఫరా సమయంలోనే అడ్డుకట్ట వేస్తే రైతులకు సరఫరా కాకుండా నియంత్రించవచ్చునని లక్ష్యంతో వ్యవసాయశాఖ ప్రత్యేక బృందాలను నియమించి తనిఖీలు చేయిస్తోంది. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాలో గత మూడు రోజులుగా ప్రత్యేక బృందాలు ఇన్‌స్టాంట్ కిట్లను ఉపయోగించి వివిధ కంపెనీల పత్తి విత్తనాలను పరిశీలిస్తున్నారు. వేంపల్లె, పులివెందుల, ముద్దనూరు, జమ్మలమడుగు, రాజుపాళెం, దువ్వూరు, పోరుమామిళ్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు మండలాల్లో వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాల నాణ్యతను పరిశీలించారు. 25 రకాల పత్తి విత్తనాలను పరిశీలించగా హెచ్‌టీ పత్తి లేదని తేలింది. విత్తన పంపిణీ చేసే కంపెనీల గోదాములు, కంపెనీదారులు, రీటైల్ డీలర్లు, దుకాణాలు, తదితర వాటిల్లో తనిఖీలు చేస్తున్నారు. అక్కడక్కడ నమూనాలను సేకరించి హెచ్‌టీ జన్యు పరీక్షలు చేసి హెచ్‌టీ ఉందా? లేదా? అని నిర్ధారిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న వెంకటేశ్

మదనపల్లె అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని సీటీఎం క్రాస్ రోడ్డులో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గురువారం తాలు కా పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సీటీఎం క్రాస్ రోడ్డుకు చెందిన శ్రీరాములు కుమారుడు వెంకటేశ్ (30) ఇటుక బట్టీల పనికి వెళు తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో తన భార్యతో గొడవపడి గన్నేరుపప్పులు తిని ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతడికి భార్య నిర్మల, ఐదేళ్ల కొడుకు ఉన్నారు.

నిద్రమాత్రలు మింగి మహిళ...



చికిత్స పొందుతున్న రంజిత

నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మదనపల్లె జిల్లా ప్రభుత్వస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు చౌడేపల్లె మండలం చిన్నకొండామర్రికి చెందిన రమణ భార్య రంజిత (38) గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థికి పాము కాటు



చికిత్స పొందుతున్న విద్యార్థి

ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం పాలకోటపల్లెకు చెందిన శ్రీనాథ్‌రెడ్డి కుమారుడు నిశాంత్‌రెడ్డి (14) ఇంటి నుంచి పొలం వద్దకు వెళుతుండగా మార్గమధ్యంలో పాముకాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గురువారం మదనపల్లెకు చెందిన ఖాదర్‌వలి (19), పుంగనూరుకు చెందిన హరీష్ (20) పనిపై తిరుపతి వెళుతుండగా మార్గమధ్యంలో సీటీఎం సమీపంలో బైకు అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి....

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాల య్యాయి. గురువారం బి.కొత్తకోట మండలం గోళ్లతోపు సమీపంలో కదిరి మండలం తనకల్లు గ్రామానికి చెందిన శివన్న కుమారుడు నాగరాజ (32) ద్విచక్రవాహనంపై తన కుటుంబసభ్యులతో మదనపల్లె వస్తుండగా గోళ్లతోపు వద్ద కారును తప్పించబోయి బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో నాగరాజ గాయపడ్డాడు, వెంటనే ఆర్టీసీ డ్రైవర్ గాయపడిన నాగరాజను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

ములకలచెరువు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లె పంచాయతీ అడివినాయనిచెరువుపల్లెలో బుధవారం రాత్రి పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన భీమిశెట్టి మస్తానప్ప ఇంటి ఆవరణంలో రోజూలాగే ఆవులు కట్టేశాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. బాధితుడికి రూ.1.20 లక్షలు నష్టం రావడంతో ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మెడతోటి మూర్తి మృతదేహం

చెన్నూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమాచుపల్లె వద్ద కడప - కర్నూలు జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడతోటి మూర్తి (18) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక కొత్తగాంధీనగర్‌కు చెందిన మెడతోటి మూర్తి తమ సొంత పనుల నిమిత్తం చిన్నమాచుపల్లె వద్దకు వెళ్లి పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కడప నుంచి చెన్నూరు వైపు వేగంగా వస్తున్న ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆ యువకుడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తలరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరు గుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని.. ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు బ్రహ్మంసాగర్‌లో వ్యక్తి...



బ్రహ్మంసాగర్‌లో నుంచి వెలికితీసిన మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మే 1 (ఆంధ్ర జ్యోతి): బ్రహ్మంసాగర్ రిజర్వా యరులో ప్రమాదవశాత్తు సుబ్బాచారి రాజగోపాలచారి (65) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా హోసోరు టౌనుకు చెందిన రాజ గోపాలచారితో పాటు 25మంది టూరిస్టులు బుధవారం బ్రహ్మంగారిమఠం వచ్చారు. దైవదర్శనం అనంతరం విహార యాత్రకు బ్రహ్మంసాగర్ వద్దకు వెళ్లారు. రాజ గోపాలచారి నీటిలో స్నానం చేయడానికి దిగడంతో గల్లంత య్యాడు. అతని కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఉదయం నుంచి గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది కలిసి వెతికి మృత దేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం బద్వేలుకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రిమ్స్ వద్ద గుర్తు తెలియని మహిళ...

కడప క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన మహిళ వయసు 50 సంవత్సరాలు ఉంటుందని, వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చి మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు 9121100523, 9121100524కు ఫోను చేసి తెలుసకోవచ్చన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీ వద్ద ఉంచినట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న కారు..
తండ్రీకొడుకులు మృతి





ఆసుపత్రిలో మృతి చెందిన సాధిక్

ముద్దనూరు మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని మునయ్యకోన సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో తండ్రీకొడుకులు మృతి చెందారు. పోలీసుల వివరాలమేరకు... కొండాపురం మండలం చౌటిపల్లెకు చెందిన హాజీ మహమ్మద్ (40) కుమారుడు సాధిక్ (4)తో ఉరుసు ఉత్సవానికి అత్తగారిపల్లె ఇంటికి జమ్మలమడుగుకు కుటుంబంతో వెళ్లాడు. సాయంత్రం చౌటిపల్లెకు తిరిగి బైకుపై వస్తుండగా మునయ్య కోన సమీపంలో ముద్దనూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా బాలుడు సాధిక్ మృతి చెందాడు. హాజీ మహమ్మద్ పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

- 61 గ్రాముల వెండి, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం



పట్టుబడ్డ దొంగల ముఠాను చూపుతున్న రాయచోటి అర్బన్ పోలీసులు

రాయచోటిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాయచోటి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వరుస దొంగతనాల నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రాయచోటి అర్బన్ పోలీసులు అంతర్ జిల్లాల దొంగల ముఠాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 61 గ్రాముల వెండి వస్తువులతో పాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అర్బన్ సీఐ బీవీ చలపతి వివరాలను వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని యండపల్లి గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి గడ్డం బసిరెడ్డి ఇంట్లో గత నెల 16వ తేదీ రాత్రి 8 గంటల ప్రాంతంలో కొంత మంది గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి బంగారు, వెండి వస్తువులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్ జిల్లాల దొంగల ముఠాకు చెందిన అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందియ బోయరాజు, ఉప్పొంక గ్రామానికి చెందిన బొట్ట నారాయణ అలియాస్ దశరథ, గుమ్మగట్ట మండలం వీరాపురం గ్రామానికి చెందిన ఎరుకుల రామకృష్ణ, ఎరుకుల రమేశ్, అనంతపురం టౌన్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన బోయ సంజీవ్‌కుమార్, ఉరవకొండ మండలం చిన్నముస్తూరు గ్రామానికి చెందిన నేసే సోమశేఖర్ అలియాస్ సోములను గురువారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం గమనించి రాయచోటి అర్బన్ ఎస్‌ఐ అబ్దుల్ జహీర్, జిల్లా క్రైమ్ పార్టీ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డిలు సిబ్బందితో కలిసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి వెండి వస్తువులను, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు. వీరి ముఠాలో పవన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడని, అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు రికవరీ చేయాల్సి ఉందన్నారు.

గండి ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరం

- ఎంపీ అవినాశ్‌రెడ్డి

చక్రాయపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు గండి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి 80శాతం పనులు పూర్తి చేశారని, అయితే చిన్నచిన్న పనులు కూడా పూర్తి చేసి టీడీపీ ప్రభుత్వం ఆలయాన్ని ప్రారంభించకపోవడం విచారకరమని ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని కుప్పం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గండి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కేసరి, రాజారమేష్‌లు పూజలు చేయించి సన్మానించారు. అనంతరం గండి ఆలయాన్ని పరిశీలించి ఆలయాన్ని ప్రారంభించకపోవడానికి కారణాలేమిటని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిత్యాన్నదాన పథకం కూడా బాగా జరుగుతోందా అని వాకబు చేశారు. ఏపీ టూరిజం కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జడ్పీటీసీ శివారెడ్డి, ఎంపీపీ మాధవి, వైసీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, హరి, జనార్దన్‌రెడ్డి, గంగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తదిత రులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం విద్యార్థికి బంగారు పతకం



ఉదయ్‌శంకర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజంపేటటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట కేంద్రీయ విశ్వవిద్యాలయం విద్యార్థి ఎస్. ఉదయ్‌శంకర్ డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మురుగన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదు సమీపంలోని నల్గొండలో గత నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన అథ్లెటిక్స్ క్రీడాపోటీల్లో డిస్కస్‌త్రోలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాజంపేట కేంద్రీయ విద్యాలయం పదో తరగతి విద్యార్థి ఉదయ్ శంకర్‌కు బంగారు పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయం వ్యాయా మ ఉపాధ్యాయుడు రాహుల్‌కుమార్ ఆ విద్యార్థిని అభినందించారు.

పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిల పదవీకాలం పొడిగింపు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ (పీఏఈసీఎస్)ల అధికారిక పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్టీ నెంబర్ 229ని జారీ చేసింది. వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లె సొసైటీకి కె.నాగరత్నమ్మ, గోనుమాకులపల్లెకు యూసీ వెంకటసుబ్బయ్య, కె.అగ్రహారం సొసైటీకి వి.వేణుమాధవరెడ్డి, దువ్వూరుకు ఎ.రాజశేఖర్, మైదుకూరు ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఎం.బ్రహ్మానందరెడ్డిని కొనసాగించారు. తాళ్లప్రొద్దుటూరు ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఇప్పటి వరకు ఉన్న ఎంవీ ప్రభాకర్‌రావు స్థానంలో ఎ.రాజశేఖర్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని అదృశ్యం

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఒంగోలు క్యాంపస్‌లో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. నాలుగురోజుల క్రితం ట్రిపుల్‌ఐటీ నుంచి ఆ విద్యార్థిని వెళ్లిపోయినట్లు ట్రిపుల్‌ఐటీ అధికారులు ఆర్కేవ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ విద్యార్థి కోసం గాలిస్తున్నారు. గుంటూరుకు చెందిన ఆవిద్యార్థిని వేరొక విద్యార్థినికి చెందిన సెల్‌ఫోన్ తీసుకెళ్లడంతో ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసింది. దీంతో భయాందోళనకు గురైన గుంటూరుకు చెందిన ఆ విద్యార్థిని నాలుగురోజుల క్రితం ట్రిపుల్‌ఐటీ నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లకపోవడంతో ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఎద్దుల కొండ ఆలయంపై పిడుగుపాటు

- దెబ్బతిన్న దేవతామూర్తుల విగ్రహాలు



పిడుగుపాటుకు ఆలయ రాజగోపురం పైనుంచి కింద పడ్డ విగ్రహాలు

వేంపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పాపాఘ్ని నదీ ఒడ్డున ఎద్దులకొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి ఆలయంపై పిడుగుపడింది. బుధవారం రాత్రి ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఆలయ రాజగోపురంపై పిడుగు పడింది. దీంతో అక్కడ దేవతామూర్తుల, ఇతర శిల్పాలు దెబ్బతిని ముక్కలుగా కిందపడ్డాయి. ఈ విషయాన్ని అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తదితరులు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, పూజారి హరిప్రవీణ్‌లకు తెలిపారు. గురువారం ఉదయం ఆలయాన్ని సందర్శించిన ఈఓ, పూజారిలు పిడుగుపాటుకు దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. కాగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ ఆలయాన్ని సందర్శించి పిడుగుపాటుకు దెబ్బతిన్న గోపురాన్ని పరిశీలించారు. ఆలయ సంప్రోక్షణ చేసి పూజలు నిర్వహించాలని కోరారు.